MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 291 | గురువారం 14 ఆగస్టు 2025 | పేజీలు : 4 | వెల : 3/-

## మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా

# ప్రయాణం చేయొచ్చు

- ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు
- ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలతో మాటామంతీ
- రేపటి నుంచే రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం





విజయవాడలో ప్రారంభించనున్న సీఎం

అంకుశం ప్రత్యేక ప్రతినిధి **అమరావతి**

సూపర్ సిక్స్ పథకాల అమలు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పరిపూర్ణం చేస్తోంది. ఈ క్రమంలో మరో సూపర్ సిక్స్ పథకం అమలుకు సిద్ధమైంది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు మహిళలకు ప్రయాణ ఖర్చుల భారం నుంచి విముక్తి కల్పిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే పథకాన్ని స్త్రీ శక్తి పేరుతో ఆగస్టు 15న ప్రారంభిస్తోంది. ఈ మేరకు శుక్రవారం స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ పిఎన్బిఎస్ లో కూటమి నేతలతో కలిసి ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తూ ఈ పథకాన్ని ప్రారంభించడం ద్వారా సూపర్ సిక్స్ పథకంలోని మరో ముఖ్యమైన - మిగతా3లో

## పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు

# టీడీపీ కైవసం




- ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థి ఘన విజయం
- పులివెందుల జడ్పీటీఎసీ ఉపఎన్నికలో విపక్ష వైసీపీకి ఎదురుదెబ్బ
- పులివెందులలో 30 ఏండ్ల తర్వాత అధికార టీడీపీ జెండా ఎగురవేసింది.
- ఘర్షణలు, పోలీసుల పహారా మధ్య సాగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం
- జడ్పీటీసీ ఉపఎన్నిక.. పులివెందులలో వైసీపీ ఓటమి

## వైఎస్ జగన్ వ్యాఖ్యల్లో

# తప్పేముందీ?



- ఎన్నిక జరిగిన 12వ తేదీ ప్రజాస్వామ్యంలో ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుంది
- ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించిన చంద్రబాబు చరిత్రలో దోషిగా నిలిచిపోతాడని అన్నారు.
- ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇంత అభద్రతాభావంతో ఉన్నాడు
- అందుకే ఇలా దిగజారిపోతాడని అనుకోలేదు
- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

అంకుశం ప్రత్యేక ప్రతినిధి విశాఖపట్నం

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో ఎన్నిక జరిగిన 12వ తేదీ ప్రజాస్వామ్యంలో ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అక్కడ జరిగింది పోలింగ్ కాదు, రిగ్గింగ్ - మిగతా3లో

## జగన్‌ది నీతిమాలిన

# రాజకీయం..



- తెరవెనుక పొత్తులకు ఆయనే బ్రాండ్
- "ఈ దేశ పౌరుల కోసం, భారత రాజ్యాంగాన్ని కాపాడే పోరాటం రాహుల్‌ది
- మోదీ, అమిత్‌షాతో జగన్‌దే హాట్ లైన్ టచ్
- చంద్రబాబుతో రాహుల్ హాట్‌లైన్ టచ్ లేదని మేం నిరూపిస్తాం

## ఉచిత బస్సు ప్రయాణం

# రేపు ప్రారంభం

- విజయవాడ బస్టాండులో ఏర్పాట్లు
- సమాచార శాఖ మంత్రి పార్థసారధి వెల్లడి




**(అంకుశం, అమరావతి, ఆగస్టు 14):**

కూటమి ప్రభుత్వం "సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడలో శ్రీకారం చుట్టనున్నారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర జనాబాలో దాదాపు 50 శాతం మంది మహిళలే ఉన్నారని, వారి అభ్యున్నతిని, సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కానుకకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారన్నారు. ఈ పథకం ద్వారా దాదాపు 2.50 కోట్ల మంది రాష్ట్ర మహిళలు రాష్ట్రంలోని 74 శాతం బస్సుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కలుగుచున్నదన్నారు. ఇందుకై రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.1,970 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు పర్చేందుకు డ్రైవర్లు, కండక్టర్లకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం - మిగతా2లో

# మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం చేయొచ్చు

-మొదటిపేజీ తరువాయి

పథకాన్ని అమల్లోకి తెచ్చినట్టు అవుతుంది. ఈ మేరకు రవాణ శాఖ, ఆర్టీసీ సిద్ధమైంది. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్లు ఇవ్వడానికి అవసరమైన సాఫ్ట్ వేర్ కూడా సిద్ధం చేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు మహిళలకు ప్రభుత్వం కల్పించింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్రంలోని సుమారు 2.62 కోట్ల మంది మహిళలు వినియోగించుకోవచ్చు. ఆర్టీసీ పరిధిలో మొత్తంగా 11,449 బస్సులు ఉంటే.. అందులో 74 శాతం బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ ఉచిత ప్రయాణాన్ని ట్రాన్స్ జెండర్లకు కూడా వర్తింప చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయి. ప్రభుత్వ అంచనా ప్రకారం మహిళలు వివిధ బస్సుల్లో వారానికి నాలుగు సార్లు సరాసరి ప్రయాణిస్తారు. ఇక ఉద్యోగాలు చేసే మహిళలైతే రోజు వారీ ప్రయాణిస్తారు. దీని నిమిత్తం నెలకు ఒక్కో మహిళకు సుమారుగా రూ.1000 నుంచి రూ.3000 వరకు ఖర్చు అవుతుంది. ముందుగా కేవలం సిటీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా.. బస్సులో ప్రయాణించే ప్రతి పేద, మధ్య తరగతి, సామాన్య మహిళకు ప్రయాణ ఖర్చు తగ్గించాలి, దూర ప్రయాణాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో కూడా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కోసం సుమారుగా రూ. 1942 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసికి చెల్లిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఈ మొత్తం భరించడం కష్టమే అయినా.. మహిళలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్గించేలా ఉంటుందని ప్రభుత్వం ఈ పథకం అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన హామీని నెరవేర్చినట్టు అయింది. ప్రయాణికులు రాష్ట్ర వాసులు అయ్యుండాలి. ఓటర్ ఐడీ, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ సహా ఇలాంటివి కండక్టర్లకు చూపించి ఉచిత ప్రయాణం చెయ్యవచ్చు. నాన్‌స్టాప్‌లు, సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు, ఘాట్ రూట్లలో తిరిగే సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. ఆడబిడ్డలకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి పథకాలు, కార్యక్రమాలు అమలు చేసింది. ఎన్టీఆర్ హయాం నుంచి నేటి వరకు అనేక కార్యక్రమాలు మహిళావర్గం కోసం అమలు చేస్తున్నారు. 1983లో పార్టీ పెట్టిన తర్వాత మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. 1986లో మహిళలకు ఆస్తిహక్కు తెచ్చారు. మహిళల కోసం పద్మావతీ మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల్లో ఎన్టీఆర్ హయాంలో మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చారు. చంద్రబాబు హయాంలో ప్రతి కి.మీ.కు ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి 3 కి.మీ.కు ఒక అప్పర్ ప్రైమరీ, ప్రతి 5 కి.మీ.కు ఒక హైస్కూల్, ప్రతి మండలానికో జూనియర్ కళాశాల, ప్రతి డివిజన్ కో ఇంజినీరింగ్ కాలేజి, ప్రతీ జిల్లాకో మెడికల్ కాలేజ్, వందలాది ఇంజినీరింగ్ కాలేజీలు తెచ్చి మహిళలకు విద్యను దగ్గర చేశారు. మహిళలకు విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు - రివాల్వింగ్ ఫండ్ అందజేత వంటి కార్యక్రమాలతో ఆర్థికంగా వారిని నిలబెట్టారు. 1997లో బాలిక శిశు సంరక్షణ పథకం కింద పుట్టిన ఆడబిడ్డకు బ్యాంకులో రూ.5 వేలు డిపాజిట్ చేసి 12 ఏళ్లు వచ్చాక వడ్డీ సహా చెల్లింపు అనే కార్యక్రమాన్ని కూడా చంద్రబాబునాయుడు నాడు అమలు చేశారు. 8, 9, 10వ తరగతి విద్యార్థినిలకు ఉమ్మడి రాష్ట్రంలోనే ఉచిత సైకిళ్ల పథకం అమలు చేశారు. 2014 తరువాత కూడా ఆ పథకాన్ని అమలు చేశారు. తద్వారా గ్రామాల్లో ఆడబిడ్డలు స్కూళ్లకు వెళ్లడానికి సౌకర్యం కల్పించారు. 2014 తరువాత మహిళలకు 11 రకాల ఉచిత వైద్య పరీక్షలు, ఆత్మగౌరవం కింద మరుగుదొడ్లు మంజూరు చేశారు. అన్న అమృత హస్తం కింద గర్భిణిలకు, బాలింతలకు పౌష్టికాహారం ఇచ్చే కార్యక్రమం కూడా నాడు ప్రారంభించిందే. నవజాత శిశువులకు బేబీ కిట్లు, తల్లీ బిడ్డా ఎక్స్ ప్రెస్, బాలామృతం వంటి పథకాలతో తల్లులకు అండగా నిలిచారు. పెళ్లి కానుక వంటి పథకాలతో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి సహాయం చేశారు.



# వైఎస్ జగన్ వ్యాఖ్యల్లో తప్పేముందీ?

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించిన చంద్రబాబు చరిత్రలో దోషిగా నిలిచిపోతాడని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇంత అభద్రతాభావంతో ఉన్నాడని, అందుకే ఇలా దిగజారిపోతాడని అనుకోలేదని అన్నారు. వ్యవస్థలను భ్రష్టుపట్టించేలా ప్రభుత్వం ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యానికే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే.. ప్రజాస్వామ్య బద్దంగా జరగాల్సిన ఎన్నికలకు అర్థాన్నే చంద్రబాబు మార్చేశారు. ఎన్నికల అధికారులు, పోలీసులతో ప్రభుత్వం కుమ్మక్కై దొంగ ఓట్లతో గెలిచింది. ఎందుకు ఈ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇంత అభద్రతతో వ్యవహరించింది.? మాది మంచి పాలన అని చెప్పుకునే ప్రభుత్వం ఎందుకు ప్రజాతీర్పును కోరకుండా, వ్యవస్థలను భ్రష్టు పట్టించి, అడ్డదోవలో గెలుపొందేందుకు తెగించింది..? ఎన్నికలు అంటేనే నిస్పక్షపాతంగా ఉండాలి. స్థానిక ఎంపీని పోలీసులు ఉదయం నుంచే అదుపులోకి తీసుకుని ఆంక్షలు విధించారు. కానీ కూటమి ప్రభుత్వంలోని మంత్రి, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా తమతో వందల కార్యకర్తలను వెంట పెట్టుకుని సెగ్మెంట్‌లో తిరుగుతుంటే, వారికి పోలీసులు భద్రత కల్పించారు. ఓటు హక్కు కోసం పోలింగ్ కేంద్రాలకు వెళ్ళిన ఓటర్ల నుంచి స్లిప్‌లను లాక్కుని, పక్క నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు దొంగ ఓట్లు వేశారు. టీడీపీలో మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్ వంటి పదవుల్లో ఉన్న నాయకులే దొంగ ఓటర్ల అవతారం ఎత్తితే, ఆ పక్కనే కలెక్టర్, డీఐజీ, డీఎస్పీ, సీఐ వంటి అధికారులు ఉండి వారితో ఓట్లు వేయించారు. పైగా ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగాయంటూ వారే ప్రకటించుకుంటున్నారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి



బ్లాక్‌డే. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి పరిణామాలు జరగాలని కోరుకోకూడదు. మంత్రి నారా లోకేష్ తన ఎక్స్ ఖాతాలో పెట్టిన ఫోటోలోనే దొంగ ఓటరు చాలా స్పష్టంగా కనిపిస్తున్నారు. దీనినేమంటారు? కూటమి ప్రభుత్వానికి తమ పనితీరు మీదే నమ్మకం లేదు. తమ గెలుపు మీద అంతకంటే నమ్మకం లేదు. అందుకే దౌర్జన్యాన్ని, పోలీసులను నమ్ముకున్నారు. ఇటువంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. ఒక చిన్న మండల స్థాయి ఎన్నికలకు ఇంతగా దిగజారిపోవాలా? దీనివల్ల ప్రభుత్వంకు ఏమైనా ఇబ్బంది ఏర్పడుతుందా? వ్యవస్థలనే నష్టపరిచేలా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తీరు అత్యంత ప్రమాదకరం. ఈ పరిణామాలనే మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్రంగా ప్రశ్నించారు. ఇంత వయస్సు వచ్చిన సీఎం చంద్రబాబుకు బహుశా ఇవే చివరి ఎన్నికలు కూడా కావచ్చు, జనం మంచిగా చెప్పునే పనులు చేయాలే కానీ ఇలాంటి మచ్చ తెచ్చుకునేలా చేస్తారా అని ప్రశ్నిస్తే తెలుగుదేశం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. వైయస్ జగన్ గారు మాట్లాడిన దానిలో తప్పేముందీ? చంద్రబాబు చేసిన ఇటువంటి అప్రజాస్వామిక విధానాల వల్ల ఆయన చరిత్రలో మచ్చపడిన నేతగా నిలిచిపోతాడు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు కనీసం పోటీ చేసిన అభ్యర్థికి కూడా అవకాశం ఇవ్వరా? పక్క నియోజకవర్గంకు చెందిన టీడీపీ నాయకులను తీసుకువచ్చి, క్యూలైన్లలో నిలబెట్టి వారితో ఓట్లు వేయించారు. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టారు. వీరంతా దొంగ ఓటర్లు అని మేం చెబితే వారిపై చర్యలు ఏవీ? పులివెందుల్లో జరిగింది రిగ్గింగ్.

**డీఐజీ కోయ ప్రవీణ్ తీరు దారుణం:**

కోయ ప్రవీణ్ డీఐజీ స్థాయి అధికారిగా వ్యవహరించిన తీరు దారుణం. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన ఒక అధికారి ఏకపక్షంగా వ్యవహరించే తీరు ఇదేనా? కడప పార్లమెంట్ సభ్యుడిని ఉదయం నుంచి నిర్భందంలోకి తీసుకుంటారు. కూటమి ప్రభుత్వంలోని మంత్రిని మాత్రం పోలీస్ బందోబస్త్ మధ్య సెగ్మెంట్‌లో విచ్చలవిడిగా తిరిగేందుకు అనుమతిస్తారు. ఇటువంటి వారి వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తుంది. సీఎం చంద్రబాబుకు ఇంత అభద్రతాభావం ఉందని అనుకోలేదు.

**మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ..**

పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి మాట్లాడిన ఎంపీ రాహూల్ గాంధీ దేశంలో జరిగిన ఓట్ల అక్రమాలపై మాట్లాడారు. దీనిలో ఏపీలోనూ ఇదే తరహాలో అక్రమాలు జరిగాయి. దానిపై కూడా ఆయన ఎందుకు ప్రస్తావించలేదని వైయస్ జగన్ ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందనే దానిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఏపీలో జరిగిన అక్రమాలపై మాట్లాడకపోవడం వెనుక ఉద్దేశాలను వైయస్ జగన్ ప్రశ్నించారు

# రంగంలోకి మంత్రుల కమిటీ సూచనలు కోరుతున్న బృందం

**గుంటూరు :** ఏపీ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ, కొత్త జిల్లాల ఏర్పాటులో సమస్యలు ఉన్నాయంటూ.. వారి పరిష్కారం కోసం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా, మండలం, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ఈ కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. ఈ మంత్రివర్గ ఉప సంఘం తొలిసారిగా సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం సెప్టెంబర్ 15వ తేదీ నాటికి సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించాలని నిర్ణయించారు.ఏపీలో జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గ ఉప సంఘం కూడా ఏర్పాటు చేశారు. ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో ఏడుగురు మంత్రులతో మంత్రుల కమిటీ ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రుల కమిటీ ఈ విషయం మీద అధ్యయనం జరపనుంది. అనంతరం సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పిస్తారు. చంద్రబాబు ఆ నివేదికను పరిశీలించిన అనంతరం కేబినేట్ భేటీలో చర్చించి ఆపై నిర్ణయం తీసుకుంటారు. ఇంత ప్రక్రియ జరగాల్సి ఉంది. అయితే మంత్రుల కమిటీ సీఎం చంద్రబాబుకు ఎప్పుడు నివేదిక సమర్పిస్తారనే దానిపై క్లారిటీ వచ్చింది.గ్రామాలు, మండలాలు, జిల్లాల పేర్లు , సరిహద్దుల మార్పులపై ఏర్పాటైన మంత్రుల కమిటీ తొలిసారిగా బుధవారం సమావేశమైంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమస్యల పరిష్కారంపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది. అనగాని సత్యప్రసాద్‌తో పాటుగా మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ అంశాలపై చర్చించిన మంత్రులు.. సెప్టెంబర్ 15 నాటికి నివేదికను సీఎం చంద్రబాబుకు అందించాలని నిర్ణయించారు. మరోవైపు డిసెంబర్ 31లోగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పుల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల 15వ తేదీ నాటికి ముఖ్యమంత్రి చేతికి నివేదిక అందించనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.ఇందులో భాగంగా ఆగస్ట్ 29, 30 తేదీల్లో మంత్రుల బృందం ఉమ్మడి జిల్లాలలో పర్యటించనుంది. మంత్రుల కమిటీ రెండు గ్రూపులుగా జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అలాగే ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి వచ్చిన సూచనలు, వినతులను వీటితో కలిపి.. సెప్టెంబర్ 15వ తేదీ నాటికే నివేదికను సీఎంకు అందజేస్తారు. మరోవైపు గ్రామాలు, మండలాలు, జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ప్రజలు తమ వినతులను జిల్లా కలెక్టర్లకు అందజేయవచ్చు. ఇందుకు సెప్టెంబర్ రెండో తేదీ ఆఖరు అని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. పేర్లు, సరిహద్దుల మార్పు అంశంతో పాటుగా కొత్త జిల్లాల ఏర్పాటు విషయాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. అయితే నియోజకవర్గాలతో సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉండటం, పరిపాలనా సౌలభ్యం, ప్రభుత్వానికి ఆదాయం పెంచటం లక్ష్యంగా మంత్రుల కమిటీ సూచనలు ఉంటాయని అనగాని సత్యప్రసాద్ వివరించారు. మరోవైపు మంత్రుల కమిటీ సమావేశం సందర్భంగా 15 మంది జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పుపై కేబినెట్ సబ్ కమిటీకి తమ వినతులను సమర్పించారు. గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ వినతి పత్రం సమర్పించారు. అలాగే బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని కొందరు, బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాల క్రిష్ణయ్య పేరు పెట్టాలని మరికొంతమంది కోరారు. ఇక శ్రీకాకుళం జిల్లా మురపాక నుంచి వచ్చిన కొంతమంది గ్రామస్థులు.. తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు.

## ఉచిత బస్సు ప్రయాణం రేపు ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి

జరుగుచున్నదన్నారు. ఉచిత ప్రయాణం సందర్భంగా ఉండే రద్దీ దృష్ట్యా ప్రయాణీకులతో మర్యాదపూర్వకంగా ఎటువంటి వాగ్వివాదాలకు అవకాశాలు ఇవ్వకుండా నడుచుకోవలసినదిగా సూచించడం జరుగుచున్నదన్నారు. టైమ్స్ ద్వారా "జీరో ఫేర్" టికెట్ ను ఏ విధంగా ఇవ్వాలో ట్రైనింగ్ ఇవ్వబడుచున్నదన్నారు. వాటిలో సాఫ్టువేర్ ఆధునీకరించి వాటిని ఏ విధంగా ఆపరేట్ చేయాలో తర్ఫీదు అందజేయడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ఆర్టీసీకి మొత్తం 11,449 బస్సులు ఉన్నాయని, ఇందులో 8,458 బస్సులు (74%) - అంటే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులలో ఈ ఉచిత ప్రయాణ పథకం అమలుకానున్నదని మంత్రి తెలిపారు. స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకునే మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసి అని తెలిపేందుకై ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, రేషన్ కార్డు వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

## పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు టీడీపీ కైవసం

**అమరావతి :** ఏపీలో నిన్న జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలయ్యింది. వైసీపీకి కంచుకోటగా ఉన్న పులివెందుల , ఒంటిమిట్ట స్థానాలు టీడీపీ పరమయ్యాయి. గురువారం జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణా రెడ్డి గెలుపొందారు. తొలి రౌండ్ ముగిసే సరికి ముద్దు కృష్ణారెడ్డికి 12,780 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ఇరుగంరెడ్డి సుబ్బారెడ్డికి 6, 351 ఓట్లు పోలయ్యాయి. 6, 267 ఓట్ల మెజారిటీతో టీడీపీ గెలుపొందింది.





**పులివెందుల..**

పులివెందుల జడ్పీటీఎసీ ఉపఎన్నికలో విపక్ష వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. వైఎస్ఆర్ కుటుంబానికి కంచుకోటగా ఉంటూ వస్తున్న పులివెందులలో 30 ఏండ్ల తర్వాత అధికార టీడీపీ జెండా ఎగురవేసింది. ఘర్షణలు, పోలీసుల పహారా మధ్య సాగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థిపై 6వేల 52 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి లతారెడ్డికి 6735 ఓట్లు రాగా, వైసీపీ క్యాండిడేట్ హేమంత్ రెడ్డికి 683 ఓట్లు వచ్చాయి. దీంతో 30 ఏండ్ల తర్వాత పులివెందుల జడ్పీటీసీ స్థానం టీడీపీ వశమైంది. 2016లో మినహా మిగిలిన ఐదుసార్లు వైఎస్ కుటుంబం నిలబెట్టిన అభ్యర్థులే ఏకగ్రీవం అయ్యారు. 2016లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున నామినేషన్ వేసిన అభ్యర్థి.. అనతరం వైసీపీలో చేరారు. దీంతో బ్యాలెట్ పేపర్లలో సైకిల్ గుర్తు ఉండటంతో ఆ పార్టీకి 2500 ఓట్లు పోలయ్యాయి.

## జగన్‌ది నీతిమాలిన రాజకీయం

**విజయవాడ:** తెరవెనుక పొత్తులకు జగనే బ్రాండ్ అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. హాట్‌లైన్ అంటూ జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనలా బలప్రదర్శన యాత్రలు చేసి... జనాలపై కార్లు ఎక్కించడం రాహుల్‌కు తెలియదని ఎద్దేవా చేశారు. "ఈ దేశ పౌరుల కోసం, భారత రాజ్యాంగాన్ని కాపాడే పోరాటం రాహుల్‌ది. మోదీ, అమిత్‌షాతో జగన్‌దే హాట్ లైన్ టచ్. చంద్రబాబుతో రాహుల్ హాట్‌లైన్ టచ్ లేదని మేం నిరూపిస్తాం. జగన్‌కి దమ్ముంటే సవాల్‌ను స్వీకరించాలి. పచ్చ కామెర్లు సోకినోడి లెక్క ఉంది జగన్ తీరు. సొంత పార్టీ నేతలు తప్పుడు పనులు చేసి అరెస్ట్ అయితే పరామర్శకు జగన్ మాదిరిగా రాహుల్ వెళ్లడం లేదు. తెరవెనుక పొత్తులకు బ్రాండ్ జగనే. అందుకే అందరూ అలా ఉంటారని అనుకుంటున్నారు. జగన్‌దీ నీతి మాలిన రాజకీయం. మోదీకి వంగి వంగి దండాలు పెట్టారు. భాజపా తీసుకొచ్చిన అన్ని బిల్లులకు మద్దతిచ్చారు. మాణిక్యం ఠాగూర్ గురించి చాలా చులకనగా మాట్లాడి.. జగన్‌కు సభ్యత, సంస్కారం లేదని నిరూపించుకున్నారు. మాణిక్యం ఠాగూర్ అడిగిన సవాల్ పై మాత్రం చర్చ చేయలేదు. జగన్‌కి దమ్ములేదని అర్థమైంది. జగన్ మోదీకి హాట్‌లైన్‌లో ఉన్నాడు కాబట్టే దత్తపుత్రుడు అన్నాం. ఆయనకు దమ్ముంటే అసెంబ్లీకి వెళ్లి ప్రశ్నించాలి. ఓటు చోరీపై పార్లమెంట్‌లో వివాదం జరుగుతుంటే నోరు మెదపరు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ పోరాటం చేస్తుంటే విమర్శలు చేస్తారా ? మోదీకి మద్దతు ఇస్తున్నట్లు మాట్లాడతారా ? మీదో పార్టీ...మీరొక నాయకుడు" అని షర్మిల మండిపడ్డారు.

## విన్నపాలు వినవలె

## కైకలూరును కృష్ణాలో కలపండి

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని ప్రజలు కోరుతున్నారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు కృష్ణా జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏలూరు జిల్లాలో ఉండటం వల్ల నీటి సమస్యలు వస్తున్నాయని, పాలన సరిగా జరగడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన మరోసారి తెరపైకి వచ్చింది.. రాష్ట్ర ప్రభుత్వం మంత్రులతో కమిటీని నియమించడంతో పలు డిమాండ్‌లు తెరపైకి వచ్చాయి. కొత్త జిల్లాల ఏర్పాటు, పేర్లు మార్పులు, సరిహద్దులు మార్పులు, రెవెన్యూ డివిజన్ల అంశాలు పరిశీలించాలని రిక్వెస్ట్‌లు వస్తున్నాయి. తాజాగా కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని ప్రజలు కోరుతున్నారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు కృష్ణా జిల్లాలో కలవాలని ప్రజలు కోరుతున్నారు. ముదినేపల్లి మండలం గుడివాడకు దగ్గరగా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు కృష్ణా జిల్లాలో కలపాలని మొదటి నుండి కోరుతున్నారు. మిగిలిన మూడు మండలాల ప్రజలు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారు. రైతులు కూడా కృష్ణా జిల్లాలో కలపాలని అడుగుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మళ్లీ జిల్లాల విభజన చేస్తుండటంతో ప్రజల ఆశలు చిగురించాయి. కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపితే తమకు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు.కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాల పునర్విభజన కమిటీ సభ్యుడైన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అంతేకాకుండా, ఆయనకు రాతపూర్వకంగా లేఖ కూడా పంపించారు. ప్రజల కోరిక మేరకు, ఎమ్మెల్యే సిఫార్సు ఉండటంతో ప్రభుత్వం కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలుపుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్. ప్రభుత్వం కచ్చితంగా కైకలూరు నియోజక వర్గాన్ని కృష్ణా జిల్లాలో విలీనం చేస్తుంది అన్నారు.కైకలూరు నియోజకవర్గాన్ని ఏలూరులో విలీనం చేయడంతో నీటి సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా జిల్లాలో నీటి వనరులు ఉండగా, కైకలూరును ఏలూరులో కలపడం వల్ల నీటి కోసం ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. కృష్ణా నది నుండి కైకలూరులోని నాలుగు మండలాలకు నీరు రావాల్సి ఉంది. రెండు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే నీరు అందుతుంది. కైకలూరు శివారు ప్రాంతం కావడంతో నీటి ఇబ్బందులు తప్పవని ప్రజలు అంటున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తాగడానికి నీరు కూడా దొరకదని భయపడుతున్నారు. ప్రస్తుతం నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. కృష్ణా నది నుండి కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని అన్ని కాల్వలకు నీరు రావాలని ఉంది.కైకలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాలన సరిగా జరగడం లేదు అనే విమర్శలు ఉన్నాయి. అధికారులు ఇక్కడ పనిచేయడానికి ఇష్టపడటం లేదట. దీనికి కారణం ఏలూరు జిల్లాలో ఉండటం. బదిలీ అయితే కృష్ణా జిల్లాలోని కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుందని అధికారులు భావిస్తున్నారట. దీంతో కైకలూరును కృష్ణా జిల్లాలో కలపాలని కోరుతున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందో చూడాలి. ఈ విషయం కమిటీ దృష్టికి రాగా.. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# భారీ వర్షానికి నష్టపోయిన ధర్మవరం చేనేతల్ని ఆదుకోండి

**- జిల్లా కలెక్టర్ కు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి**

**- సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్**

**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 14:** ధర్మవరం ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన చేనేతలను ఆదుకోవాలని.. జిల్లా కలెక్టర్ కు నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ సమస్యల మీద పుట్టపర్తిలోని కలెక్టరేట్ లో కలెక్టర్ టి.ఎస్.చేతన్ ను ఆయన కలిశారు. ముఖ్యంగా వర్షాల వలన జరుగుతున్న నష్టం గురించి కలెక్టర్ కు వివరించారు. ధర్మవరం పట్టణంలో గత 7 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ధర్మవరంలోని పలు కాలనీలలోకి నీరు చేరిందన్నారు. ముఖ్యంగా చేనేత కుటుంబాల ఇళ్లలోకి నీరు వచ్చి..మగ్గాల్లోకి వర్షపునీరు చేరి చీరల తయారీకి వాడే వార్పు, సప్పూరి, జరీ పూర్తిగా దెబ్బతిందన్నారు. ఇందులో ఏ ఒక్కటి కూడా ఉపయోగించుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఇందిరమ్మ కాలనీ, సత్యసాయి నగర్ లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. చీర తయారీకి వినియోగించే ముడిసరుకులతో పాటు నిత్యావసర సరుకులు కూడా పూర్తిగా నీట మునిగి.. కనీసం వండుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ చేతన్ గారి దృష్టికి శ్రీరామ్ తెలియజేశారు చేనేత కుటుంబాలు దీనస్థితి పరిస్థితి గుర్తించి... ప్రభుత్వం నుంచి వర్షాకాల భృతితో పాటు నిత్యావసర సరుకులు అందించాలని విజ్ఞప్తి చేశారు. చేనేతలు నష్టపోయిన ఫోటోలు కూడా కలెక్టర్ కు అందజేశారు. మరోవైపు ముదిగుబ్బ, తలుపుల మండలాల పరిధిలోని మద్దిలేరు వంతెన ఐదేళ్ల క్రితం పూర్తిగా దెబ్బతిన్నప్పటికి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టలేదన్నారు. ఈ వంతెనపై ప్రతి నిత్యం వేలాది మంది భయభయంగా ప్రయాణిస్తున్నారన్నారు. నల్లమాడ నుంచి పులివెందుల, తలుపుల వైపు, అలాగే కదిరి నుంచి మల్లేపల్లి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఈ మార్గంలోనే నడుస్తున్నాయని వివరించారు. లో లెవెల్ వంతెన కావడంతో వర్షాకాలంలో మద్దిలేరు వాగు ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయన్నారు. వర్షం కారణంగా ముదిగుబ్బ తలుపుల మండలాల 25 గ్రామాల ప్రజలు మరో 10 కిలోమీటర్లు చుట్టేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. 2021లో నివార్ తుఫాన్ సమయంలో అధిక వర్షాలతో వంతెన పూర్తిగా కొట్టుకుపోయిందన్నారు. ఇప్పటివరకు తాత్కాలికంగా మట్టి, రాళ్లు, సిమెంట్ పైపులతో మరమ్మతులు చేసినా, ప్రతిసారి వరదలతో మళ్లీ మళ్లీ దెబ్బతింటూనే ఉందని కలెక్టర్ కు వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మద్దిలేరు వాగు మళ్లీ ప్రవహిస్తే వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉందని.. అందుకే ఆ వంతెనను తాత్కాలికంగా మట్టి, రాళ్లు తో మరమత్తులు చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత శాశ్వత పరిష్కారానికి నిధులు మంజూరు చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరామ్ చెప్పిన అంశాల మీద కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత అధికారుల ద్వారా నివేదికలు తెప్పించుకుంటానన్నారు. చేనేతలకు పరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు...



# ఈనెల 20లోగా పనులు ప్రారంభించాలి.. లేదంటే కాంట్రాక్టర్లను బ్లాక్ లీస్ట్ లో పెట్టండి





**- అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన**

**- అనంతపురం-తగరకుంట వయా తోపుదుర్తి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే సునీత**

**- ఒక తోపు కమీషన్ల కక్కుర్తి వలన.. ప్రజలకు ఈ సమస్యలు వచ్చాయన్న సునీత**

**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 14:** ఈనెల 20వ తేదిలోగా అనంతపురం-తగరకుంట వయా తోపుదుర్తి మార్గంలో రోడ్డు పనులు ప్రారంభించాలని.. లేదంటే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఆమె గురువారం రోజు అనంతపురం నుంచి బి.యాలేరు మార్గంలో తోపుదుర్తి, తగరకుంట వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. అనంతపురం నుంచి తగరకుంట రోడ్డులో బి యాలేరు గ్రామ సమీపంలో 14.2 కిలోమీటర్లు నుంచి 39కిలోమీటర్లు వరకు రోడ్డు ఎంత అధ్వాన్నంగా ఉందో అందరికీ తెలుసునని ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. సుమారు 25కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి 2021లో ప్రారంభించి 2023లో పూర్తి చేసేవిధంగా పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అప్పటి ఎమ్మెల్యే తోపు ప్రకాష్ రెడ్డితో పాటు ఆయన సోదరులకు కప్పం కట్టాలంటూ కాంట్రాక్టర్లను బెదిరించడంతో వారు పారిపోయారన్నారు. ముడుపులు చెల్లించలేక అప్పటికే ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు కానీ.. పనులు మాత్రం పూర్తి కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభించమని ఎస్.ఈ గారికి చెప్పినా ఇంకా పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే సునీత అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. గత ప్రభుత్వంలో లాగా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈనెల 20వ తేదిలోగా పనులు ప్రారంభించి.. గడువు కంటే ముందే పనులు పూర్తి చేయాలన్నారు. అలా చేయని పక్షంలో కాంట్రాక్టర్లను బ్లాక్ లీస్ట్ లో పెట్టేందుకు కూడా వెనుకాడవద్దన్నారు...

## పులివెందుల ఎన్నికల్లో గెలుపుపై

**- ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులతో కలసి సంబరాలు**

**- 40ఏళ్ల తర్వాత ఆ ప్రాంతంలో ప్రజాస్వామ్యం కనిపించిందన్న దగ్గుపాటి ప్రసాద్**



**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 14:** వైనాట్ పులివెందుల అని ముందే చెప్పామని.. అది ఈ ఎన్నికల్లో గెలిచి చూపించామని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి గెలుపుపై నగరంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో జడ్పీ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఈ సంబరాలు జరిగాయి. బాణసంచా కాలుస్తూ డబ్బులు వాయిస్తూ టిడిపి శ్రేణులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత పులివెందులలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగాయన్నారు. ఇక్కడ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో ఈరోజు చూశారన్నారు. 40ఏళ్లుగా జగన్ రెడ్డి కుటుంబం అరాచకాలు చేస్తూ.. ఇక్కడ ఏకపక్షంగా విజయాల సాధిస్తోందన్నారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లెం వేశారన్నారు. శాంతిభద్ర విషయంలో ఆయన ఎక్కడ రాజీపడరన్నారు. పులివెందుల ప్రాంతానికి ఒక్కరోజు ముందే స్వతంత్రం వచ్చినట్టు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ గెలుపు వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఉన్నారన్నారు. కేవలం ఒక పులివెందుల, ఒంటిమిట్ట మాత్రమే కాకుండా కడప జిల్లాలో ఎక్కడ చూసినా తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మణసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, నాయి బ్రాహ్మణ డైరెక్టర్ కడియాల కొండన్న, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణం, టిడిపి నాయకులు కృష్ణం రఘు, నాయుడమ్మ, ఓంకార్ రెడ్డి, ముస్తాక్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# నగరాల్లో సమగ్ర అభివృద్ధి జరగాలంటే మాస్టర్ ప్లాన్ కీలకం

**- జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ.**






**అంకుశం న్యూస్ అనంతపురం, ఆగస్టు 14 :** అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమగ్ర అభివృద్ధి జరగాలంటే మాస్టర్ ప్లాన్ కీలకమని జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు అహుడా సెక్రటరీ రామకృష్ణ రెడ్డి తో కలిసి అనంతపురం మరియు హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి, మరియు మాస్టర్ ప్లాన్,లేఔట్లు రిజిస్ట్రేషన్ స్కీమ్ (యల్ ఆర్ ఎస్) సంబంధించి సంభందిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమగ్ర అభివృద్ధి జరగాలంటే మాస్టర్ ప్లాన్ కీలకమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము మెట్రోపాలిటన్ ప్రాంతాలు మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూల్స్, 2018 నిబంధనల ప్రకారం అనంతపురము-హిందూపురము అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా) పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం మరియు గుత్తి పురపాలక సంఘం పరిధి యొక్క డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్లను రూపకల్పన చేయబడిదని దీని పై ప్రజా అభిప్రాయాల సేకరణ,పూర్తి అవగాహన కలిగించాలన్నారు. మాస్టర్ ప్లాన్ అనేది పట్టణాభివృద్ధికి దిశానిర్దేశం కల్పించే ప్రధాన పథకపత్రం. ఇది నివాస, పారిశ్రామిక, వాణిజ్య, మౌలిక, వినోద రంగాలలో అభివృద్ధి పథకాలను రూపొందిస్తూ, నగరానికి దీర్ఘకాలిక వ్యూహాన్ని నిర్దేశిస్తుందని, భూవినియోగం, రవాణా, రహదారి విస్తరణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను కలిగి ఉండి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నగర రూపకల్పనకు దోహదపడుతుందన్నారు. ఈ సమావేశంలో ప్లానింగ్ అధికారి ఇషాక్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు దుష్యంత్,హరీష్, రేవంత్ ప్రసాద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల గడ్డపై టీడీపీ జెండా ఎగరడం పై ఎమ్మెల్యే వేగుళ్ళ హర్షం



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** ఒక ఉప ఎన్నికతో పులివెందుల కోట బద్దలైంది. దశాబ్దాల బానిస సంకెళ్లను తెంచేసి పులివెందుల గడ్డపై టీడీపీ జెండా ఎగిరిందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ కూడా రాకపోవడం చూస్తే అక్కడ వైసీపీ యొక్క అరాచకానికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు అని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందే పులివెందుల ప్రజలకి స్వేచ్ఛ వచ్చిందని ఎమ్మెల్యే వేగుళ్ళ పేర్కొన్నారు.

## దేవరకొండ వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న దారపనేని



**కనిగిరి ఆగస్టు 14 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ వాస్తవ్యులు దేవరకొండ చెన్నకేశవులు (మేస్త్రి) శ్రీమతి వెంకట లక్ష్మమ్మ దంపతుల కుమారుడు దేవరకొండ మోహనకృష్ణ శ్రీమతి సుమతి దంపతులు గురువారం నూతనంగా నిర్మించిన గృహంలో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ పాల్గొని దేవరకొండ మోహన్ కృష్ణ దంపతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ బాలయ్య, పోతయ్య, దేవరకొండ వెంకటసుబ్బమ్మ, కుమారి, యాదగిరి నాగేశ్వరరావు, సురేష్ దేవరకొండ వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ కు డాక్టరేట్ ప్రధానం



**అంకుశం న్యూస్ విజయవాడ ఆగస్టు 14:** విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ కి డాక్టరేట్ స్థానిక నున్న గ్రామంలోని విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ కి బి ఉదయ్ కుమార్ కి అన్నమలై యూనివర్సిటీ చిదంబరం (తమిళనాడు)వారు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఉదయ్ కుమార్ గారు “ఎఫెక్ట్ ఆఫ్ స్ట్రక్చర్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ అండ్ ప్లేయోమెట్రిక్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ ఫిజికల్ అండ్ ఫిజియోలాజికల్ వేరియబుల్స్ అమౌంట్ త్రోవర్స్” అనే అంశంపై డాక్టర్ ఆర్ రతినకమలన్ ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ శ్రీ ఎన్ సత్యనారాయణ రెడ్డి గారు మాట్లాడుతూ మా కళాశాల అధ్యాపకులను పరిశోధనల విషయాల్లో మేము ఎప్పుడూ వారికి సహకరిస్తూ వారి ఉన్నతికి తోడ్పడతామని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ఉదయ్ కుమార్ గారిని అభినందించారు. డాక్టర్ బి ఉదయ్ కుమార్ గారు మాట్లాడుతూ ఈ పరిశోధన చేయడానికి సహకరించిన అందరికీ అధ్యాపకులకు సహచరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**అంకుశం ప్రతినిధి అనంతపురం ఆగస్టు 14:** శ్రీకృష్ణుడి జన్మదిన సందర్భంగా అనంతపురం కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సుబ్బారెడ్డి ఏజియం హాజరయ్యారు ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమితిథి నాడు శ్రీకృష్ణుడు జన్మించాడని కృష్ణాష్టమి వేడుకలను ప్రపంచవ్యాప్తంగా ఎంతో సంబరంగా జరుపుకుంటారని తెలిపారు శ్రీకృష్ణుడు పది అవతారాలలో 8వ అవతారంగా జన్మించాడని తెలిపారు దేవకీ వసుదేవుల అష్టమ సంతానంగా శ్రీకృష్ణుడు అష్టమి తిథి రోజు జన్మించారని శ్రీకృష్ణుడే మనకు ఆదర్శ ప్రియుడు కావున మీరు కూడా కృష్ణాష్టమి రోజు కృష్ణుని భక్తిశ్రద్ధలతో కొలచి మంచి పనులకు శ్రీకారం చుట్టండి అని తెలిపారు అనంతరం విద్యార్థినీ విద్యార్థులు గోపిక కృష్ణుడి వేషధారణలతో పాఠశాలలో వారి నృత్య విన్యాసాలను తిలకించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, దీన్లు చిరంజీవి, సిరాజుద్దీన్, అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్, ఏవో గోపాల్ పాల్గొన్నారు

## మేము పులివెందలలో డిపాజిట్ కోల్పోయిన ప్రజాస్వామ్యంలి .....!

**అధికారభాషా సంఘం పూర్వ సభ్యులు డా. తవ్వా వెంకటయ్య**



**అంకుశం న్యూస్ కడప ఆగస్టు 14:** పులివెందుల,ఒంటిమిట్టల జడ్పిటిసి ఎన్నికల్లో ప్రజాస్వామ్యం డిపాజిట్ కోల్పోయిందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డా.తవ్వా వెంకటయ్య గురువారం మీడియా ద్వారా విచారం వ్యక్తం చేశారు. అబ్రహం లింకన్ చెప్పినట్టుగా ...ప్రజల చేత ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకునేదే నిజమైన ప్రజాస్వామ్యమని గుర్తు చేశారు.దీనికి విరుద్ధంగా పులివెందులలో ప్రజలు ఓట్లు వేయకుండానే ఎన్నికలు జరిగాయని ఎద్దేవ చేశారు. ఇందులోగెలుపోటములు ప్రజాస్వామ్యానికి కొలమానమే కాదని విమర్శించారు. ..ప్రజలకు ఓటు వేసే స్వతంత్రాన్ని హరించి బలవంతంగా తమ మనుషుల చేత ఓట్లు వేయించుకొన్నారన్నారు. దీంతో గెలిచామని చెప్పుకొనే కూటమి ప్రభుత్వం నిజంగా ప్రజల మనసుల్లో ఓడిపోయినట్లేనని ఎద్దేవచేశారు. పులివెందుల ,ఒంటిమిట్ట జెడ్పిటిసిలు గెలవడం వల్ల కూటమి ప్రభుత్వానికి ఒరిగేది లేదని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోల్పోయేది ఏమీ లేదని ఆయన చెప్పారు.కానీఅప్రజాస్వామ్య పద్ధతులలో ప్రజలను ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టాలో అన్ని రకాలుగా ఇబ్బంది పెట్టి ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ గుప్పిట్లోకి పెట్టుకొని ఎన్నికల్లో గెలిచిన ఈ గెలుపు గెలుపే కాదని ఘాటుగా స్పందించారు..

# మహిళల సాధికారత కోసమే 'స్త్రీ శక్తి' పథకం అమలు




- ఎంపీ కేశినేని శివనాథ్
- 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ కేశినేని శివనాథ్ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు
- పండిట్ నెహ్రూ బస్టాండ్ లో 'స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

**అంకుశం ప్రతినిది , విజయవాడ:ఆగస్టు 14:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల సాధికారత కోసమే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ లో 'స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఇందుకోసం పండిట్ నెహ్రూ బస్టాండ్ లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ పరిశీలించారు. సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ బస్టాండ్ లో 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభోత్సవానికి సిద్దం చేస్తున్న సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ , ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు , విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి 'స్త్రీ శక్తి పథకం అమలు చేయనుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని మహిళలందరూ చాలా సంతోషంగా వున్నారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. . ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు సమపాళ్లలో ముందుకు తీసుకువెళుతున్నారని కొనియాడారు. సూపర్ సిక్స్ లోని హామీలను ఒక్కొక్కటిగా సీఎం చంద్రబాబు నెరవేర్చుకుంటూ వస్తున్నారన్నారు.

ఫ్రీ బస్ స్కీం తో కర్ణాటక లో 23 శాతం మహిళ సాధికారత పెరిగిందన్నారు. ఏపీలో అంతకుమించి మహిళకు ఉపాధి, ఎంప్లాయి మెంట్ పెరుగుతందన్నారు. 'స్త్రీ శక్తి పథకం వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వారు చెయ్యరు..చేసే వాళ్లని చెయ్యనీరు అంటూ ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు అధికారంలో వస్తే ఏ పని చేయరని గ్రహించే ప్రజలు...వైసిపి ప్రతి పక్ష హెూదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు.

# అనంతపురం, చిత్తూరు జట్ల విజయం

- హరిత (4 వికెట్లు) స్పిన్ మాయాజాలం
- బ్యాటింగ్ లో రాణించిన సాయిలక్ష్మి, హన్సిరెడ్డి, జెస్సికా, హంస
- బౌలింగ్ లో రాణించిన పౌజియ, ప్రవల్లిక, ప్రణీతయాదవ్, సాత్విక రెడ్డి





**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం ఆగస్టు 14:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ సీనియర్ ఉమెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ లీగ్ మ్యాచ్ లలో అనంతపురం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. అనంతపురం స్పిన్ బౌలర్ హరిత తన స్పిన్ మాయాజాలంతో కర్నూలుపై 4 వికెట్లు సాధించి అనంతపురం విజయంలో కీలకపాత్ర పోషించింది 9.2 ఓవర్లలో 13 పరుగులు ఇచ్చి 4 కీలకమైన వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచింది. అనంతపురం ఆర్డిటి క్రీడా మైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్ లో అనంతపురం, కర్నూలు మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం 37.2 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌట్ అనంతపురం జట్టులో హన్సిరెడ్డి 6 ఫోర్లతో 39 పరుగులు, ఆర్సియా 28, చక్రికా 20, పరుగులు తీశారు కర్నూలు బౌలర్లు ఫౌజియా 3, ప్రవల్లిక 3, శ్రీ నవ్య 2 మైతిలి, ముబీన చెరో ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. కర్నూలు జట్టు 36.2 ఓవర్లలో 92 పరుగులకు ఆలౌట్ కావడంతో అనంతపురం 41 పరుగులతో విజయం సాధించింది కర్నూలు బ్యాటర్లు అనూష 25, రజియా 19, సాయి నికిత 14 పరుగులు తీశారు హరిత 4, హన్సి 2, తరుణం 2, తేజస్విని ఒక వికెట్ తీసుకున్నారు

**నెల్లూరు వర్సెస్ చిత్తూరు**

ఆర్డీటీ క్రీడామైదానంలోని అనంతపురం క్రికెట్ గ్రౌండ్లో చిత్తూరు, నెల్లూరు మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో మ్యాచును 44 ఓవర్లకు కుదించారు. చిత్తూరు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొని నెల్లూరును బ్యాటింగ్ కు ఆహ్వానించింది. నెల్లూరు 44 ఓవర్లలో 126 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది సాయిలక్ష్మి 42, జెస్సికా 34, సుహాన 21 పరుగులు తీశారు, చిత్తూరు బౌలర్లు ప్రణీత యాదవ్ 3, రుక్సాన్, పద్మజ చెరో ఒక వికెట్ తీసుకున్నారు చిత్తూరు 25.2 ఓవర్లలో 128 పరుగులు చేసి 6 వికెట్లతో విజయం సాధించింది హంస 31, శుభశ్రీ 25, గ్రీష్మ 23, ప్రణీతయాదవ్ 18 పరుగులు తీశారు నెల్లూరు బౌలర్ సాత్విక రెడ్డి 3 వికెట్లు తీసుకుంది. ఈ మ్యాచ్ లను ఆంధ్ర మహిళా క్రికెట్ ఆపరేషన్ మాజీ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పర్యవేక్షించారు.

**రేపటి మ్యాచ్ ల వివరాలు**

ఆగస్టు-15: చిత్తూరు వర్సెస్ అనంతపురం (అనంతపురం క్రికెట్ గ్రౌండ్)
ఆగస్టు-15 కడప వర్సెస్ నెల్లూరు (రాయలసీమ క్రికెట్ గ్రౌండ్)

# అధికారికంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్ర సవిత
- 16న రాష్ట్ర వ్యాప్తంగా సర్దార్ జయంతి
- అణగారిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న ఎనలేని సేవలు
- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి జయింతి : మంత్రి సవిత




**అంకుశం ప్రతినిధి పెనుకొండ/శ్రీసత్యసాయి :ఆగస్టు 14:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఆయన జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినందుకు సీఎం చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. 1909 ఆగస్టు 16న ప్రస్తుత శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకాలో బారువా గ్రామంలో ఒక సాధారణ గౌడ కుటుంబంలో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు 8వ సంతానంగా లచ్చన్న జన్మించారన్నారు. గౌతు లచ్చన్న పోరాట యోధుడే కాదు గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని, హరిజన రక్షణ యాత్రలు నిర్వహించారని తెలిపారు. హరిజనులకు దేవాలయాల ప్రవేశాలు చేయించారన్నారు. బడుగు, బలహీన వర్గాల్లో విద్యావ్యాప్తికి రాత్రి బడులు నిర్వహించారన్నారు. జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున్న పోరాటం చేసిన యోధుడు గౌతు లచ్చన్న అని వెల్లడించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు తన 21వ ఏటా గౌతు లచ్చన్న స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారన్నారు. ఎన్నో పర్యాయాలు జైలుకెళ్లారన్నారు. 1952లో సోంపేట నియోజకవర్గం నుంచి గెలుపొంది గౌతు లచ్చన్న మద్రాసు రాష్ట్ర శాసనసభలో తొలిసారిగా అడుగు పెట్టారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటులో గౌతు లచ్చన్న కీలక పాత్ర పోషించారన్నారు. టంగుటూరు ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో లచ్చన్న మంత్రిగా పనిచేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా కూడా పనిచేసిన గౌతు లచ్చన్న తరవాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారన్నారు. గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారనన్నారు. కార్యదక్షత, ఉక్కు సంకల్పం వల్లే గౌతు లచ్చన్నకు సర్దార్ అని బిరుదు వచ్చిందన్నారు. దేశంలో సర్దార్ గా సర్దార్ వల్లభాయి పటేల్ కు, గౌతు లచ్చన్న మాత్రమే పేరుగాంచారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 16న ఆయన జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

## రైతు మొహంలో సంతోషమే కనిపిస్తోంది.. పరిటాల సునీత

- రామగిరి మండల కేంద్రంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ
- వందలాదిగా పాల్గొన్న రైతులు.. చిరుజల్లుల మధ్యనే సాగిన ప్రదర్శన
- పులివెందుల ఫలితాలు చూసి పులి.. పిల్లి అయినట్టుందన్న సునీత





**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 14:**రాప్తాడు నియోజకవర్గం లో రైతుల ఆనందం కనబడుతుందని ప్రతి ముఖంలో ఎంతో ధైర్యం కనపడుతున్నదనిపలుగు, పార పట్టి కష్టపడి పొలంలో పని చేసే ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అందిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండల కేంద్రంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు ట్రాక్టర్లతో తరలి వచ్చి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రతి ట్రాక్టర్ కు అరటి పిలకలు, మామిడి తోరణాలు కట్టి, ప్రతి రైతు మెడలో ఆకుపచ్చ కండువా వేసుకుని ఎంతో సంతోషంగా కనిపించారు. రామగిరి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా ఈ ప్రదర్శన సాగింది. ఎమ్మెల్యే సునీత ట్రాక్టర్ ఎక్కి డ్రైవింగ్ చేసి .. ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. చిరుజల్లులు వస్తున్నా కూడా ఈ ప్రదర్శన ఎంతో ఉత్సాహంగా సాగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో 52వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ అందిందన్నారు. ప్రతి రైతుకు 7వేల చొప్పున 36కోట్ల రూపాయలు అందిందందన్నారు. గతంలో జగన్ రెడ్డి 15వేలు ఇస్తామని చెప్పి.. కేవలం కొంత మందికే ఇచ్చారన్నారు. రైతుల విషయంలో కూడా పార్టీలు చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీలకతీతంగా ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. అందరికీ 13వేల రూపాయలు సాయం చేశారన్నారు. తమ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. తమ పథకాలు అందలేదన్న వారు కేవలం 10మంది లోపే ఉన్నారన్నారు. అది కూడా ఉద్యోగాలు, వాహనాలు వంటి కారణాలు ఉన్నాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ ఇప్పటికే అమలవుతున్నాయన్నారు. స్వాతంత్రదినోత్సవం సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అనే కానుకను అందజేస్తున్నారన్నారు. మహిళలందరికీ ఇది సంతోషాన్నిచ్చే వార్త అన్నారు. అయితే అంతా ఒకే రోజు ఒకే బస్సులో వెళ్లి.. ఇబ్బంది పడవద్దని.. ఇది ప్రతి రోజు అమల్లో ఉంటుందని సంయమనంతో ఉండాలన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల వారు సంతోషంగా కనిపిస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు.. పులివెందుల పులి.. పిల్లి అయ్యింది. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలతో అక్కడ పులి అని చెప్పుకుని జగన్ రెడ్డి పిల్లిలా మారారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎలా ఉంటాయో పులివెందుల ప్రజలు చూశారన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమకు ఇప్పుడే స్వాతంత్రం వచ్చిందని చెబుతున్నారంటే.. అక్కడ మొన్నటి వరకు ఎంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చున్నారు. జగన్ రెడ్డి తాత కాలం నుంచి ఇక్కడ నియంతృత్వ పోకడలతోనే ఎన్నికలు జరిగాయన్నారు. ఇప్పుడు అసలైన ఎన్నికలు జరిగాయని.. అందుకే వైసీపీ దారుణంగా ఓడిపోయిందన్నారు. ఇక త్వరలో జగన్ రెడ్డి జైలుదారి పట్టడానికి కూడా సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు...

## ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలి.

- హర్ ఘర్ తీరంగా ర్యాలీలో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.




**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి - ఆగస్టు,14:** ప్రతి ఒక్కరిలో జాతీయభావం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. గురువారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగ స్థానిక శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుండి వై జంక్షన్ వరకు సాగిన ర్యాలీ ని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ జండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరు త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి దేశభక్తి ని చాటుతూ ర్యాలీ కొనసాగింది. వై జంక్షన్ వద్ద మానవ హారం ఏర్పడి దేశభక్తి ఉట్టిపడేలా అందరిచేత కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి లో, ప్రతి ఇంటా దేశభక్తి ఉట్టిపడేలా ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని అన్నాడు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫిరోజ్ బేగం, డిఎస్డీఓ ఉదయ్ భాస్కర్, డిపివో సమత, అధికారులు, ఏ ఏం ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం అర్బన్ డీఎస్పీకు విశిష్ట సేవా పతకం

- డీఎస్పీని అభినందించిన జిల్లా ఎస్.పి పి.జగదీష్



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఆగస్టు 14:** శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది చేస్తున్న అంకితబావంతో కూడిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పతకాన్ని( Police Medal For Meritorious Service) అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావుకు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి పి.జగదీష్ డీఎస్పీని ప్రత్యేకంగా అభినందించారు. వల్లూరి శ్రీనివాసరావు1989 వ సంవత్సరంలో పోలీస్ శాఖలో ఎస్సైగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2004 లో సి.ఐ గా... 2014 లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఆతర్వాత నూజివీడు, కందకూరు, చీరాల, విజయవాడ ఈస్ట్ ప్రాంతాలలో పని చేశారు. తాజాగా అనంతపురం డీఎస్పీగా విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రశంశలు పొందారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించినందుకు తన సర్వీస్ లో చాలా రివార్డులను ఉన్నతాధికారుల నుండి అందుకున్నారు. ఏపి సేవా పతకం, ఏపి ఉత్తమ సేవా పతకం, ఏపి మహెూన్నత సేవా పతకం, అతి ఉత్కృష్ట సేవా పతకాలు ఇదివరకే అందుకున్న డీఎస్పీ తాజాగా Police Medal For Meritorious Service పతకానికి ఎంపిక కావడం విశేషం.